

8న పిఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

పిఠాపురం రాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), కాకినాడలోని నోడల్ రిసోర్స్ సెంటర్‌లో ఈ నెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌3 ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బివి.తిరుపణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వంటి 10 ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ నిమిత్తం ఇంటర్వ్యూలు చేస్తారని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు 2019 నుంచి 2023 వరకు ఏ డిగ్రీ పాసైన అభ్యర్థులైనా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎస్మా ఉన్నా పోరాటం ఆగదు...


ఇటీవల కాకినాడలో కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల భారీ ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమను బెదిరిస్తూ ఎస్మాను ప్రయోగించిన సర్కారు బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు. స్కీమ్ వర్కర్లుగా పని చేస్తున్న అంగన్‌వాడీలకు జిఒ నెంబరు 2 ద్వారా ఎస్మా వర్తింపచేయదని చెబుతున్నారు. చాకిరీ బారెడు వేతనం మూరెడు అన్న చందాన ఉంది అంగన్‌వాడీల పరిస్థితి. ఐసిడిఎస్ పరిరక్షణకు, మాతా శిశు మరణాలను తగ్గించేందుకు, ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూసేందుకు, 6 రకాల జబ్బులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించేందుకు పౌష్టికాహార లోపాన్ని నివారించే విధులను అంగన్‌వాడీలు నిర్వర్తిస్తున్నారు. వీటితో పాటు జాబ్ చార్టులో లేని అనేక సేవలను నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. వీరికి కనీస వేతనాలను అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఉద్యోగ భద్రత లేని అంగన్ వాడీల సమస్యలపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమోషన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 26 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రభుత్వం తాము కోరిన విధంగా సమస్యలను పరిష్కరిస్తే వెంటనే సమ్మె విరమించి విధులకు హాజరవుతామని స్పష్టం చేస్తున్నారు.

ఎస్మా ప్రయోగం సరికాదు

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపు ధోరణితో ఎస్మాను ప్రయోగించడం సరికాదని సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీను అమలు చేయాలని 26 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే స్పందించకుండా రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పనికి తగ్గ వేతనం చెల్లించకుండా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయి



నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో సమ్మె చేస్తుంటే అవకాశం ఉన్నా వాటిని పరిష్కరించకపోగా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోంది. గతంలో ఎస్మాను ప్రయోగించిన ప్రభుత్వాలు కూలిపోయాయి. వైసిపికి కూడా రోజులు దగ్గరపడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- దడాల పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ యూనియన్.

సమ్మెను ఉధృతం చేస్తాం



మా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలను ఇబ్బందులకు గురి చేస్తోంది. పనికి తగ్గ ప్రతిఫలం ఆశిస్తుంటే ప్రభుత్వం ఉద్యమాలను అణగదొక్కాలని చూస్తోంది. ఇప్పటికైనా సిఎం దిగి రావాలి. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మెను ఉధృతం చేస్తాం.

- రమణమ్మ, జిల్లా కోశాధికారి, అంగన్‌వాడీ యూనియన్.

ఎస్మాలకు బెదిరేది లేదు



తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటిని పరిష్కరించి విధులకు హాజరయ్యేలా చూడాల్సింది పోయి బెదిరించే ధోరణితో ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరైంది కాదు. తెలంగాణ కంటే రూ.1000 అదనంగా వేతనం ఇస్తామని చెప్పిన జగన్ హామీని తక్షణమే నిలబెట్టుకోవాలి. ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలి. అలా కాకుండా ఎస్మాను ప్రయోగించాలని చూస్తే వెనక్కి తగ్గేది లేదు.

- ఇ.చంద్రావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపి అంగన్‌వాడీ యూనియన్.

సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రి నిర్మాణం

ప్రజాశక్తి-కాకినాడ


యుపిహెచ్‌సిని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎంఎల్ఎ

పట్టణంలోని 10వ డివిజన్‌లో రూ.1.89 కోట్ల సిఎస్ఆర్ నిధులతో వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. శనివారం డివిజన్‌లోని తారకరామ నగర్, దుమ్ముల పేటలో కాకినాడ సీ పోర్టు సౌజన్యంతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్, ఎంపీ వంగాగీత, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్, కాకినాడ సీ పోర్టు ఎమ్‌డి కెవి.రావు, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ డివిజన్‌లో వైద్య సేవలు నిమిత్తం గతంలో రెండు కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వచ్చేదన్నారు. సీ పోర్టు సిఎస్ఆర్ నిధులు రూ.1.89 కోట్లతో ఈ వైద్య శాలను నిర్మించినట్టు చెప్పారు. నిర్మాణ పనులు కేవలం ఏడు నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన కాకినాడ సీ పోర్టు లిమిటెడ్‌కు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్మించిన ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మంచి వైద్య సేవలు అందుబాటులో వున్నాయని ఈ సదుపాయాలు నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పన, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జెనరసింహ నాయక్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, మురళీధర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ రంగోలి పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ రంగోలి సహకరిస్తుందని విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటిస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని సైన్స్ రంగోలీ పోటీని నిర్వహించారు. దీనిలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్ మండలాల్లో 18 పాఠశాల నుంచి 148 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వినూత్నంగా సైన్స్ బొమ్మలు, సైన్స్ అంశాలను రంగోలి రూపంలో ప్రదర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ రంగోలి సహకరిస్తుందన్నారు. ప్రతి విద్యార్థీ సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. హెచ్‌ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బాలల సైన్స్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సూరిబాబు. వి.గోవిందు, జి.మేరీ విజయ్ కుమారి, ఎంవిఎస్.రామకృష్ణ, సిహెచ్.శ్రీహరి రావు, రుషి ప్రసాద్ పాల్గొన్నారు. విజేతలకు ప్రశంస పత్రాలు మరియు బహుమతులను అందించారు.

శ్రీ ప్రకాష్ డిగ్రీ కళాశాలకు నాక్ ఎ గ్రేడ్

ప్రజాశక్తి-కోటనందూరు

శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ (శ్రీ ప్రకాష్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, సైన్సెస్) డిగ్రీ కళాశాలకు నాక్ ఎ గ్రేడ్ లభించిందని విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు తెలిపారు. కళాశాలలో అన్ని ప్రమాణాలను పరిగణనలోనికి తీసుకుని జాతీయ స్థాయిలో ఎ గ్రేడ్ ఇచ్చారని తెలిపారు. నాక్ ఎ గ్రేడ్ గుర్తింపు పొందిన ప్రథమ డిగ్రీ కళాశాల అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ గుర్తింపు పొందడానికి సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తమను మరింత ఉన్నతంగా భావితరాల అభ్యున్నతి కోసం కృషి చేసేలా ప్రేరణ ఇస్తుందని తెలిపారు.

18 రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కాకినాడ


సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులు తలపెట్టిన సమ్మె శనివారం 18వ రోజుకి చేరుకుంది. ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి సందర్భంగా ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సమ్మెను మరింత ఉధతం చేయడం మినహా ఉద్యోగులకు మరొక మార్గం లేదని, ఇచ్చే జీతాలు కుటుంబాల్ని పోషించుకునేందుకు ఏమాత్రం సరిపోవడం లేదని, తక్షణం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్షలో పని చేసే ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, కేంద్ర పథకాలలో అమలు జరుగుతున్నట్టుగా మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జెఎసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.చంటిబాబు, సత్యనాగమణి, ఉపాధ్యక్షులు ఎంవి.సాయికిరణ్, ఎ.లోవరాజు, పివివి.మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, జి.నారాయణ, ఎంబి.సాల్మన్, జిల్లా కోశాధికారి పి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

పారిశుధ్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-కాకినాడ


పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన నగరంలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 1, 2, 3 సర్కిల్స్ పరిధిలోని వెంకట్ నగర్, పేర్రాజుపేట, రేచర్లపేట, డైరీఫారం, సాంబమూర్తి నగర్, గుడారిగుంట, ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్, విఎస్.లక్ష్మి కళాశాల ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. చెత్త సేకరణ కోసం ఇళ్లకు వచ్చే టిప్పర్ వాహనాలకు తడి-పొడి చెత్తను వేరువేరుగా అందజేయాలని సూచించారు. చెత్తను ఇంటి బయట, డ్రైనేజీలలోను వేయడం వల్ల పారిశుధ్యం క్షీణించి ప్రజారోగ్యానికి భంగకరంగా మారే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో హూపర్ టిప్పర్ వాహనాల ద్వారా చెత్త తరలింపును ఆయన పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ జూనియర్ ఆఫీసర్ కె.కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని వడ్లమూరులో వైసిపి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవరావు ఇంటి వద్ద శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని డాక్టర్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 348 పశువులకు గాలి కుంటి వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు బి.ప్రసాద్, కె.పుష్పరాజ్, కె.రాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారిణి లక్ష్మి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం గౌరీ కోనేరు వీధికి చెందిన కనకం లక్ష్మి(70) శనివారం మృతి చెందారు. ఆమె 40 సంవత్సరాల పాటు బుర్రకథ కళారూపంలో ప్రధాన కథకురాలిగా భర్త సూరిబాబుతో కలిసి రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా ఆమె ప్రదర్శనలు ఇచ్చారు. ఆమె మృతికి ప్రజానాట్య మండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, గరగపాటి పెంటయ్య, కుంచే అచ్చారావు, కేదారి నాగు, మంతెన సత్తిబాబు, పట్టణ కళాకారులు ఆనెం సత్యనారాయణ, ఎంఎస్ వర్మ సంతాపం వ్యక్తం చేశారు.

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

నిరుపేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని సిఎం వైఎస్.జగన్ ఆరోగ్య బీమాను రూ.25 లక్షలకు పెంచారని వైసిపి జిల్లా కార్యదర్శి, స్థానిక కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. 5,411 కుటుంబాలకు నూతన ఆరోగ్యశ్రీ బీమా కార్డులను శనివారం ఆయన పంపిణీ చేశారు. శిడగం వెంకటేశ్వరరావు, కోరాడ ప్రసాద్, తొండారపు రాంబాబు, షేక్ దిల్బర్ హుస్సేన్, కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీల 24 గంటల దీక్ష

అంగన్‌వాడీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. నిర్బంధాలను లెక్క చేయబోమని వారు స్పష్టం చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం


కాకినాడలో దీక్షా శిబిరంలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

కాకినాడ కలెక్టరేట్ వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు ప్రారంభించారు. కలెక్టరేట్ వద్ద దీక్షలకు అనుమతులు లేవని పోలీసులు అడ్డుకోవడంతో ఎండలోనే ఫుట్‌పాత్‌పై బైఠాయించారు. దీంతో పోలీసులు దిగిరాక తప్పలేదు. అంగన్‌వాడీలకు న్యాయ సహకారం అందిస్తామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జ్యోతి తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దడాల పద్మ, ఎరుబండి చంద్రవతి మాట్లాడారు. నాయకులు ధనలక్ష్మి, రాజేశ్వరి, వీరమణి, వరలక్ష్మి, మంగతాయారు, భాంధవి, కె.సీత, ఎం.గంగాభవాని, సిహెచ్.రాధ, నారాయణమ్మ, ఎం.సుజాత, జి.ప్రేమావతి, నూకరత్నం, పి.వరలక్ష్మి, డి.వీరవేణి పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకట రమణ, రాయుడు మోజెస్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి, జిజిహెచ్ మెస్ యూనియన్ నాయకులు కృష్ణ మద్దతు తెలిపారు. **కిర్లంపూడి** నల్ల బెలూన్లతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. రత్నం, కె.అచ్యుతాంబ, ఎలిజిబిత్ రాణి, పి.సావిత్రి, షేక్ పర్వీన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం పాల్గొన్నారు. **ఏలేశ్వరం** తహశీల్దారు కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు. వీరికి సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మానుకొండ లచ్చబాబు, జనార్ధన్ మద్దతు తెలిపారు. కె.సత్య, అచ్చిరాజు, యు.మరియ, గనిలక్ష్మి పాల్గొన్నారు. **పిఠాపురం** అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్దకు 108 ఉద్యోగుల సంఘం నాయకులు రాజు వచ్చి తమ మద్దతు తెలిపారు. అమల, వెంకటలక్ష్మి, ప్రజావాణి, నళిని, సత్యవతి, భవాని, అమల, బేబీరాణి, రామలక్ష్మి, నాగ పద్మ పాల్గొన్నారు. **కోటనందూరు** అంగన్‌వాడీల సమ్మెకు మాజీ కేంద్ర మంత్రి ఎంఎం.పల్లంరాజు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికులు సమస్యలు పరిష్కరించలేని ముఖ్యమంత్రి జగన్‌కు పాలించే అర్హత లేదని వారు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, దాట్ల కార్యరాజు మాట్లాడారు. అంగన్‌వాడీ నాయకులు ధనలక్ష్మి, మేరీ సమాధానం, పద్మ శాంతి, లీల, సిఐటియు మండల నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. **పెద్దాపురం** నల్ల గొడుగులు, బెలూన్లతో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు బేబీ, వరలక్ష్మి, దుర్గ, భవాని, పద్మ పాల్గొన్నారు.


పెద్దాపురంలో..



మున్సిపల్ కార్మికులకు పలువురి మద్దతు


సమస్యలపై మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. కార్మికుల సమ్మె శనివారం 11వ రోజుకు చేరుకుంది.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ నగర పాలక సంస్థ క్లాప్ వాహన డ్రైవర్స్ మున్సిపల్ కార్మికులకు మద్దతుగా ఆందోళన చేపట్టారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడారు. అనేక సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ కార్మికులు, డ్రైవర్స్, క్లాప్ వాహన డ్రైవర్స్ సమస్యలను తీసుకువెళ్లినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం వల్లనే సమ్మె బాట పట్టారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో క్లాప్ డ్రైవర్స్ కూడా సమ్మెలో భాగస్వాములు అవుతారని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకట రమణ, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.సంతోష్, విక్టర్, భద్ర, విజయ్ కుమార్, దుర్గా ప్రసాద్, శివశంకర్, గంగాధర్ పాల్గొన్నారు.


కాకినాడలో క్లాప్ వాహన డ్రైవర్స్ మద్దతు

సామర్లకోట రూరల్ ఇతర కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహించడం ఏమిటని కార్మికులు సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావును ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే దీక్ష కొనసాగింది. కమిషనర్ ఛాంబర్‌లో వారు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సిపిఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ ఎలిశెట్టి రామదాసు, పెదిరెడ్ల అర్జున్, బొచ్చ శీను, కసింకోట ఆనందరావు, కసింకోట కిషోర్, ఎస్.శ్రీనివాస్, చింతల రమణ, బంగారు రత్నం, బంగారు తులసి, పెనుబాక సారమ్మ, బంగారు కొండమ్మ, వేల్పుల సింహాచలం, గూడుపు దాలమ్మ, చిన్న దుర్గ భవాని పాల్గొన్నారు. **గొల్లప్రోలు (పిఠాపురం)** వర్కర్లు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. శానిటేషన్ వర్కర్స్ నాయకురాలు యేసమ్మ మాట్లాడారు. సిఐటియు నాయకులు నందీశ్వరరావు, శానిటేషన్ వర్కర్స్ కార్యదర్శి సిహెచ్ వి రమణ. రామారావు, పార్వతి సత్యవతి, లోవ, రాము, సత్తిబాబు, సురేష్, కుమారి పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ వర్కర్లు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు వర్రే వెంకటలక్ష్మి, నీలాపు నూకరత్నం, వర్రే కుమారి, దుర్గ, సింగంపల్లి మరిడమ్మ, వర్రే దేవి, పెడారి భవాని, వర్రె పెద్ద వెంకటలక్ష్మి, పలివెల సత్యవతి, భవాని పాల్గొన్నారు.


పిఠాపురంలో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న వర్కర్లు


పెద్దాపురంలో సాధికార యాత్ర సభ

వైసిపి ద్వారా సామాజిక న్యాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి ప్రభుత్వం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పలువురు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పెద్దాపురం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్లో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ప్రసంగిస్తూ అట్టడుగు, దళితులు, వెనకబడిన తరగతుల ఆర్థిక, సామాజిక అభివద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సభలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు, జూపూడి ప్రభాకర్ రావు, ఎంపీ వంగా గీత, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పెందుర్తి ఎంఎల్ఎ అదీప్ రాజు, పిఠాపురం ఎంఎల్ఎ దొరబాబు, ఆవాల రాజేశ్వరి, జెడ్‌పిటిసి గవరసా సూరిబాబు, చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడం తో ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు . ఈ దాడులలో నార్కెడిమిల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.61,920 స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇవి.. రాజవరం గ్రామ శివారు శనివారం నాటు సారా అమ్ముతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ బి వై.కిరణ్ కుమార్ సిబ్బందితో వెళ్లి నాటు సారా అమ్ముతున్న కొల్లి రవికుమార్ ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టు లో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

సారాను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో శనివారం మండలంలోని ఇనగంటివారి పేటలో సారాను విక్రయిస్తున్న చాకలి చంద్రమోహన్‌ను అరెస్టు చేసి ఒక లీటర్ సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి చెప్పారు. ఆ వ్యక్తిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.2860లను స్వాధీనంచేసుకున్నారు. వారిని స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

సారా బట్టిలపై దాడులు నిర్వహించి నాటు సారా, బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని కరగపాడు గ్రామము శివారులో నాటు సారా తయారీ కేంద్రం(బట్టి)పై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో తయారు చేసిన 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారు చేయుటకు నిల్వ చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక వ్యక్తిని అరెస్టు చేసి సారా తయారు చేయుటకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మద్యం నిందితుల బైండోవర్

ప్రజాశక్తి - కరప

మండలంలోని అక్రమ బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, అదేవిధంగా నాటు సారా తయారు చేస్తున్న 30 మంది నిందితులను మండల మెజిస్ట్రేట్, తహాశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ జెవి.భవాని తెలిపారు. బైండోవర్ అయిన నిందుతులంతా సక్రమంగా వ్యవహరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎంవివిబి.కుమార్ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

శనివారం సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవంలో శారద రామకృష్ణ సేవాసమితి విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించినట్లు సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ తెలిపారు. విశ్వ మానవత సంస్థ ప్రతినిధి పెమ్మాడి వీరభద్ర వర్మ ఆధ్వర్యాన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన కార్యక్రమంలో ఫిట్స్, చిన్నపిల్లల్లో మందబుద్ధి, మానసిక సమస్యలు, ఆస్తమా, పక్షవాతం, నిద్ర పట్టకపోవుట, కీళ్లవాతం, హార్ట్ సమస్యలు, ఫైల్స్, ఫిస్టులా, సోరియాసిస్, డెంగ్యూ ఫీవర్స్, స్త్రీలలో గైనిక్ అనారోగ్య సమస్యలు గల 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నాయకులు పాల్గొని రోగులకు సహకరించారు.

వల్లభ స్వామి ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,04,390, అన్నదాన విరాళాల ద్వారా రూ.50,345, కేశ ఖండన ద్వారా రూ 3,720 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించమన్నారు. యాత్రికులకు దేవస్థానం చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసిలు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీకుమార్, పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ తనిఖీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో సంచార వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీని శనివారం ఆర్‌డిఒ సీతారామారావు తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ఎండియు ఆపరేటర్స్ రేషన్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. సరుకులు పంపిణీ సమయంలో సచివాలయాల వాలంటీర్లు వాహనం దగ్గర ఉంటున్నదీ లేనిదీ పరిశీలించారు. సరుకుల పంపిణీపై రేషన్ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు జితేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సింపోజియంలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ విద్యార్థి వై.గీతామాధురి, ఇటీవల భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ స్టూడెంట్ టెక్నికల్ సింపోజియంలో ద్వితీయ స్థానం సాధించారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ ఎస్.రామశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, ఇతర అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

సమస్యలపై పోరు.. ఉద్యమాల హోరు..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సమస్యలపై కార్మిక లోకం పోరుబాట పట్టింది. ఉద్యమాలు చేస్తూ న్యాయం కోసం ఎదురుచూసోంది. మరో పక్క ప్రజా ఉద్యమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం నానా కుట్రలు పన్నుతోంది. ఎలాగైనా అణచివేయాలనే ధోరణితో చివరికి ఎస్మాను సైతం ప్రయోగించింది. అయినప్పటికీ ఉద్యమాన్ని వీడేది లేదని, సమస్యలను పరిష్కరించాల్సిందేనని కార్మిక లోకం ముక్తకంఠంతో స్పష్టం చేస్తోంది.

హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు 26 రోజులుగా సమ్మెలో ఉన్నారు. వారు సమ్మెలో ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్ధలు కొట్టించి ప్రభుత్వం అబాసుపాలైంది. అయినప్పటికీ తన బుద్ధిని మార్చుకోకుండా మరో అడుగు ముందుకు వేసి సమ్మెను నిషేదిస్తూ ఎస్మాను ప్రయోగించింది. శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. గత వారంలో ప్రజా ప్రతినిధుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల వద్దకు వెళ్లి నిరసనలు తెలిపి వినతిపత్రాలను అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. త్వరలోనే తీపికబురు అంటూ ఓ మంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో భిన్నమైన పరిస్థితులునెలకొన్నాయి. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ఇతర విధులు ఉండటంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. అలాగే విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు డిసెంబరు 20న సమ్మెలోకి వెళ్లిన విషయం విధితమే. గడిచిన 16 రోజులుగా వివిధ రూపాలలో తమ నిరసన తెలుపుతున్నారు. వారిపైనా ప్రభుత్వం అణచివేతకు పాల్పడింది. నాయకులను అక్రమ అరెస్టులు చేయించింది.

మున్సిపల్ కార్మికులు సైతం సమ్మెలోకి దిగడంతో పట్టణాలు, నగరాల్లోన పారిశుధ్యం క్షీణిస్తోంది. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అలా కాకుండా పోటీ కార్మికులను దింపి సమ్మెను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. కార్మికుల మధ్య గొడవలు సృష్టించాలని చూసింది. దీన్ని కార్మికులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఒక పక్క కరోనా కలవరం మొదలైంది. ఈ సమయంలో పారిశుధ్యంపై దృష్టిసారించాల్సి ఉంది. కార్మికుల సమ్మెతో నానాటికీ పారిశుధ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వం మాత్రం తన మొండి వైఖరిని వీడట్లేదు. వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రావట్లేదు.

అధికార పార్టీలో సిట్టింగులకు సెగ

మరోపక్క రాజకీయంగాను ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. అధికార వైసిపి సిట్టింగులకు సెగ పెట్టడంతో రాజకీయం రంజుగా మారింది. నియోజక వర్గాల వారీగా విడుదల చేసిన సమన్వయ కర్తల జాబితా మరింత మంటలు రేపుతోంది. జిల్లా అధ్యక్షుల పేర్లు సైతం ఖరారు చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సీటు దక్కని సిట్టింగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వారు ఇతర పార్టీల వైపు చూడటంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. ఇదిలా ఉండగా అధికార పార్టీ ప్రచార యావ మరింత పతాక స్థాయికి చేరింది. ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలపైనా, ధృవీకరణ పత్రాలపైనా జగన్ ఫొటోలతో ముద్రించడం విమర్శలకు దారి తీసింది. తాజాగా సామాజిక పింఛన్లను సైతం రాజకీయానికి వాడుకుంది. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛను ప్రభుత్వ తీరుతో ఏడు తేదీన అందుకోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు జనసేనాని పవన్ కళ్యాణ్ ఉమ్మడి జిల్లాపై దృష్టి సారించారు.ఈ మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేశారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. కార్తీక మాసం దాటినా ధరలు పేలుతున్నాయి. బహిరంగ మార్కెట్లో టమోటా రూ.50 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున, చిక్కుడు కాయలు సైతం కిలో రూ.100 మార్కు దిగిరానంటున్నాయి. మరోవైపు బియ్యం ధరలూ పెరగటంతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. తుఫాను నేపథ్యంలో తాజాగా కూరగాయల తోటలకు పంటనష్టం వాటిల్లిన విషయం విధితమే. దీంతో మరి కొన్ని రోజులపాటు ఈ ధరలు నేలను తాకే అవకాశం లేదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలుగు భాష సజీవం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్


తెలుగు మహాసభలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - రాజానగరం

తెలుగు బాష సజీవంగానే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న త్రిదిన అంతర్జాతీయ తెలుగు మహాసభ రాజరాజ నరేంద్ర వేదికపై శనివారం 'పత్రికా సాహిత్య సదస్సు'ను నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు పత్రికలను కొని చదివి ప్రోత్సహించాలన్నారు. తెలుగు నేర్చుకోవడమే కాకుండా రాయడం, మాట్లాడటాన్ని విస్తతంగా అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా తెలుగు జాతికి కీర్తి పెంచాలని సూచించారు. వివిధ పత్రికల సంపాదకులు, సహ సంపాదకులు తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అంతర్జాతీయ తెలుగు మహాసభలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. ఘంటశాల రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చైతన్య రాజు అధ్యక్షతన గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీపార్వతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాలకు మన సంస్కృతి తెలుసుకోడానికి అంతర్జాతీయ తెలుగు మహాసభ దోహదం చేస్తుందన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ తెలుగు విశిష్టతను తెలిసే విధంగా ఈ సభ ఉందన్నారు.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ మానవేంద్రరాయ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సినీ నటుడు గౌతంరాజు, కవి భాస్కరభట్ల రవికుమార్ తదితరులకు పురస్కారాలు అందించారు.

తెలుగు మమకార భాష కావాలి : వరప్రసాదరెడ్డి

తెలుగు అధికార భాష అంటున్నారని నిజానికి మమకార భాష కావాలని శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కెఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. కృతజ్ఞతాంజలి సభలో ఆయన మాట్లాడారు. ఏ జాతి ఔన్నత్యమైనా భాష, సంస్కృతి, సంప్రదాయాలపై ఆధారపడి ఉంటుందన్నారు.

మెడికవర్‌లో అరుదైన చికిత్స

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ జిల్లాకు చెందిన 13 ఏళ్ల బాలుని చేతికి క్యాన్సర్ వ్యాధి (ఆస్ట్రియోసర్కోమా) సోకగా మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స నిర్వహించారు. శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో చికిత్స పొందిన బాలునితో పాటు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అరుణ్ కుమార్, క్లస్టర్ హెడ్ సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాలుని భుజపు ఎముకలో కణితి ఏర్పడి క్యాన్సర్ అని నిర్ధారించుకున్నాక పలువురు నిపుణులతో కూడిన బృందం బాలుడికి సర్జరీ చేసి క్యాన్సర్‌కు చికిత్స అందించినట్లు చెప్పారు. క్యాన్సర్ కణజాలంను రేడియేషన్ ద్వారా తొలగించామన్నారు. ఇది అరుదైన ఎముక కాన్సర్ అని తెలిపారు. ఎముకల్లో అసాధారణ కణాలు నియంత్రణ లేకుండా పెరిగినప్పుడు ఈ క్యాన్సర్ వస్తుందన్నారు. ఆరోగ్య శ్రీలో ఉచితంగా బాలునికి చికిత్సను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, డాక్టర్ పర్థీవ్‌రాజ్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, ఆర్.గౌతమ్‌రామ్, శ్రీకాంత్, ఆపరేషన్స్ హెడ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై మండలంలోని చేబ్రోలులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.భాస్కరాచార్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022ను తెచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని, ప్రజల ఆస్తి హక్కు నిర్ధారించే హక్కు ఈ చట్ట ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ అధికారికి కట్ట పెట్టారని తెలిపారు. ప్రథమ అప్పిలేట్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఉంటారని చట్టంలో పేర్కొన్నట్లు తెలిపారు. అధికారులు ఇచ్చే ఆర్డర్లపై అప్పీల్‌కు హైకోర్టుకు మాత్రమే అవకాశం కల్పించినట్లు తెలిపారు. స్థానిక సివిల్ కోర్టులకు విచారణ పరిధి కల్పించలేదని తెలిపారు. సామాన్యులు వ్యయ, ప్రయాసలు పడి హైకోర్టుకు వెళ్లి న్యాయం పొందే పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. పట్టణ కార్యదర్శి కొంగు నూకరాజు మాట్లాడుతూ ప్రజల ఆస్తికి భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయమని ప్రజల తరపున పోరాడుతున్నామని తెలిపారు. ఎపి బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాలు, న్యాయ కోవిదులతో ఎటువంటి సంప్రదింపులు జరగకుండా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టంతో ఇప్పటివరకు ఎటువంటి వివాదాలు లేని ప్రజల ఆస్తులు కొత్త వివాదాల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు, ఐలు నాయకులు బుద్దాల రాంబాబు, ఓరుగంటి చరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

వైసిపికి వార్డు సభ్యుల రాజీనామా

ప్రజాశక్తి-గండేపల్లి

సుబ్బయ్యమ్మపేటకు చెందిన వైసిపి నాయకులు గొల్లవిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ఏడుగురు పంచాయతీ వార్డు సభ్యులు పార్టీకి రాజీనామా చేశారు. జ్యోతుల నెహ్రూ సమక్షంలో వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ ప్రతిరోజూ ఏదో ఒక గ్రామం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు టిడిపిలో చేరుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి గాలికి వదిలేసిన ఎంఎల్‌ఎ మల్లేపల్లి నుండి సుబ్బయ్య పేట వెళ్లే రోడ్డు పనులు 25 శాతం పూర్తిచేసినా మిగతా పని చేయలేకపోయారన్నారు. అందరి సహకారంతో రాబోయే ఎన్నికల్లో గెలిచి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని చెప్పారు. ఎస్‌విఎస్. అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, మాజీ సర్పంచ్ బొండా శీను బాబు, బొండా శ్రీను, గొల్లవిల్లి రాజు, అప్పన శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయంలో రూ.కోటీ 50 లక్షల వ్యయంతో నిర్మించే 5 అంతస్తుల గాలి గోపురం నిర్మాణానికి, టికెట్స్ కౌంటర్ నిర్మాణానికి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఈ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, గోపు మురళి పాల్గొన్నారు.

'చంద్రబాబు హయాంలో దోపిడీ'

ప్రజాశక్తి -కరప

చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నూతనంగా మంజూరైన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఒక వ్యక్తి మరణిస్తే తప్ప మరో వ్యక్తికి పెన్షన్ ఇచ్చేవారు కాదని కన్నబాబు గుర్తు చేశారు. గురజనాపల్లిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూమి లెవెలింగ్ పనులు చేయించి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, సర్పంచ్ ఆశాజ్యోతి, చింత ఈశ్వరరావు, పబ్బినీడి పాపారావు, ఎంపిడిఒ అప్పారావు పాల్గొన్నారు.

పెన్షన్ కానుక పంపిణీ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న పెన్షన్ కానుక పంపిణీలో వైసిపి జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొని పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌ను చెప్పిన విధంగానే రూ.3 వేలకు పెంచిన ఘనత సిఎం వైఎస్.జగన్‌కే దక్కుతుందని అన్నారు. గతంలో ఎంఎల్‌ఎగా, ఎంపీగా, మంత్రిగా మండలంలో అనేక అభివృద్ధి పనులు చేశానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన తనయుడు తోట రామ్‌జీ, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపిపి బొడ్డేటి గణపతి పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో సాంకేతికత

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రతి విద్యార్థికీ సాంకేతిక విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా సిఎం వైఎస్.జగన్ కృషి చేస్తున్నారని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. తాళ్ళరేవు మండలం చొల్లంగి, నీలపల్లి జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు 205 బైజూస్ టాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చొల్లంగి హైస్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరి, నీలపల్లి హైస్కూల్ హెచ్‌ఎం రాధాకృష్ణ, జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, కళ్యమూర్తి, చొల్లంగి ఉప సర్పంచ్ స్వర్ణ రాజు తదితరులు

మహా సంస్థానం ఆదాయం రూ.16 లక్షలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక శ్రీ పాద శ్రీ వల్లభ మహా సంస్థానం హుండీలను శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. రూ.16,73,265 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఇఒలు శ్రీనివాసరావు, సౌజన్య, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్నం జనార్ధన్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ప్రమాదంలో మరణించిన వ్యక్తికి బీమా అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ డిసెంబర్ 31న రంగవల్లి నగర్‌కు చెందిన కల్యాణం చినమరిడియ్య ప్రమాదానికి గురై మరణించగా ఆయన కుటుంబానికి రావాల్సిన బీమా పథకాల గురించి అధికారులను అడగగా బీమా లేదని, ఎటువంటి రాయితీలు రావని చెప్పారన్నారు. ఎన్నోసార్లు సచివాలయానికి, వాలంటీర్ వద్దకు వెళ్లి రేషన్ కార్డు కావాలని, బీమా పథకాలు రాయాలని చెప్పినా పట్టించుకున్న పాపన్న పోలేదన్నారు.

యానాం వార్తలు


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్ఎఒ, మల్లాడి కృష్ణారావు

యానాం ప్రజా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పర్యాటకశాఖ, వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20వ యానాం ప్రజా ఉత్సవాలు, 22వ ఫల పుష్ప ప్రదర్శన కార్యక్రమాలు శనివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అగ్రికల్చర్ డిడి శివ సుబ్రహ్మణియన్, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం, ఎస్‌పి రఘునాయిగం అతిథులుగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలలో తొలిరోజు రఘు బందం సినీ జానపద గీతాలు, ఆర్కెస్ట్రా, కూచిపూడి నత్య ప్రదర్శనలు, క్లాసికల్ డాన్స్ ప్రోగ్రామ్స్, మ్యాజిక్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఫల పుష్ప ప్రదర్శనలో పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మొక్కలు పండ్లు కనువిందు చేశాయి. మరో రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలకు యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నుంచి కర్రి నూకేష్ వర్మ, జగడం ప్రవీణ్ కుమార్, చింతా వాసు ఎంపికయ్యారని క్లబ్ సెక్రటరీ కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్ తెలిపారు. వీరు పుదుచ్చేరి రాష్ట్రం తరపున ఆడతారన్నారు. వీరికి బొట్టా శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారన్నారు. ఈ ముగ్గురు స్పోర్ట్స్ కోటాలో చెన్నై సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఎంపికైన సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

సమస్యలపై ఆసుపత్రి సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో 13 సంవత్సరాలుగా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన శనివారం 3వ రోజుకు చేరింది. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. ఆందోళనకారులు మాట్లాడుతూ సుమారు 44 నెలలుగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఎంఎల్ఎ అశోక్‌కు వినతిపత్రం అందించారు. తమకు తక్షణమే న్యాయం చేయాలని కోరారు.